# రాక్షసనీడ

నాలుగురోజులుగా పెరిగిన గడ్డాన్ని అద్దంలో చూసుకుంటూ ఓసారి చేత్తో సుతారంగా నిమురుకున్నాడు విశ్వం. చుబుకందగ్గర రెండు వెంట్రుకలు తెల్లగా తళుక్కున మెరిసేసరికి ఉలిక్కిపడ్డట్టు చూసుకున్నాడు - 'ముప్ఫయి నాలుగేళ్ళు దాటకనే తన గెడ్డం నెరిసిపోతోంది! అంటే... నిరుద్యోగిగానే తన బతుకు పండిపోతోందన్నమాట!' - అలా అనుకోగానే అతని మొహంలో నిరాశ చీకట్లు ఆవరించాయి. చూపుల్లో దిగులు స్పష్టంగా కనబడి తనమీద తనకే ఎక్కడలేని జాలీ పుట్టుకొచ్చింది.

"అన్నయ్యా... నీ షర్టు గుండీ కుట్టమన్నావ్... ఏదీ - ఇవ్వు మరి" అంది రాధ.

"అదిగో... కుర్చీమీద వేశాను చూడమ్మా - షర్టు జేబులోనే ఉంది గుండీ!"

రెండు నిముషాల్లో షర్ట్‌కు గుండీ కుట్టేసింది రాధ.

"నాన్న వెళ్ళమన్నచోటికి తొందరగా వెళ్ళిరా అన్నయ్యా! నిద్ర లేస్తూనే వెళ్ళలేదేమని అడుగుతాడు. నువ్వింకా వెళ్ళలేదని చెబితే బాధపడతాడు" అంది రాధ షర్టుని విశ్వానికి అందిస్తూ.

"సర్లే... వెళ్ళక ఏం జేస్తాను!" కాస్త విసుగ్గానే అన్నాడు విశ్వం.

"ఎందుకురా! అంత విసుగూ! ఆరునెలలకో, సంవత్సరానికో ఓ పని చెబుతారు మీ నాన్న - అదికూడా చేయలేవా?" అంది జానకమ్మ - కిరోసన్ స్టవ్‌ని శుభ్రపరుస్తూ.

"ఊఁ... ఎందుకు చేయనూ... కాస్త మెల్లగా మాట్లాడండి! తల్లీ కూతుళ్ళిద్దరివీ ఇంతింత లావు గొంతులు... మీ మాటలకి నాన్న లేచినా లేస్తాడు" అన్నాడు విశ్వం - పక్క గదిలో పడుకుని ఉన్న వాళ్ళనాన్న వేపు ఓసారి అనుమానంగా చూస్తూ. గాఢనిద్రలో వున్నాడు ఆయన.

చిన్నప్పటినుంచి విశ్వానికి ఒక భయం ఉంది - దాన్ని భయం అనడం కన్నా ఆందోళన అనడం సబబేమో! నిద్రపోతూ ఉన్న తండ్రిని ఎందుకో ఒక్కోసారి జాగ్రత్తగా గమనించేవాడు విశ్వం. వాళ్ళ నాన్న నిద్రలోనే శాశ్వతనిద్రలోకి వెళ్ళిపోయాడేమోనని అనుమానం... అలా అతనికి ఎందుకనిపిస్తుందో తెలీదు. గాఢనిద్రలో ఉన్న మనిషికి

ఒక్కోసారి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తేలిగ్గా వుంటాయి. అప్పుడసలు ఊపిరాడుతోందా లేదా - అని ఎవరికైనా అనుమానం వస్తుంది. అదే సందేహం అతనికీనూ. అలా ఆందోళనపడి కాసేపు కంపించిపోతాడు. మరికాసేపు తదేకంగా గమనించి ఊపిరి ఆడుతున్నట్టు ఎదెగిసిపడుతోంటే తన ఆందోళన పోగొట్టుకుంటాడు. తమ తండ్రిపోతే ఇంకేమైనా ఉందా... తన సంసారం నడిసముద్రంలో నావలా మునిగినట్టే అనిపించేదతనికి.

"ఎందుకలా నాన్నవేపు చూస్తున్నావన్నయ్యా?" అంది రాధ.

"ఏమీ లేదమ్మా... నాన్న మేలుకొని ఉన్నాడేమోనని..." అంటూ గొణిగాడు విశ్వం.

"ఒంట్లో బాగాలేదుగా... టాబ్లెట్లు వేసుకుని పడుకున్నాడు... అప్పుడే ఎలా మేలుకుంటాడు?" అంది రాధ.

విశ్వం అద్దంలో తన డ్రెస్‌నీ, మొహాన్నీ ఓసారి చూసుకొని వీధిలోకి వెళ్ళిపోయాడు.

అసహనంగా అడుగులు వేస్తున్నాడు విశ్వం. అతని అసహనానికి కారణం - ఆరోజు ఉదయం వాళ్ళనాన్న రాఘవయ్యగారి దగ్గర ఐదువందలు అప్పు తీసుకురమ్మని చెప్పటమే. ఏ పని చేయడానికయినా మహదానందంగా ఒప్పుకుంటాడుగానీ, అప్పు తీసుకురమ్మంటే మాత్రం ఎంత ఇబ్బందిపడిపోతాడో చెప్పలేం.

ఇలా అప్పు అడగడానికి వెళ్ళడం అతనికిదేం మొదటిసారికాదు కానీ, వెళ్ళిన ప్రతిసారి - ఆ అప్పిచ్చేవాళ్ళ ఫోజులూ, మాటలూ అతనికిష్టం వుండేవికావు. అప్పు ఇచ్చేవాళ్ళు కావాలనే అలా మాట్లాడతారో లేక తనే ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో అలా ఊహించుకుంటాడో విశ్వానికి అర్థం అయ్యేదికాదు.

"అప్పు చేయకుండా బతకడానికి వీలుకాదా?" అన్న ప్రశ్నకు జవాబు - నాన్నే... అవును... అప్పు చేయకుండా ఎలా వుండగలరు... సత్యకాలం మనిషిలా ఆఫీసుల్లో లంచాలు తీసుకోకుండా, ప్రమోషన్ లేకుండా ఇరవై ఏడేళ్ళుగా గుమాస్తాగా బతుకీడుస్తూ అయిదుగురు సంతానంతో ఎవరుంటారు అప్పు చేయకుండా! ఆఖరికి అక్కయ్య పెళ్ళికూడా అప్పుతోనే చేశాడు నాన్న.

- ఇలా ఆలోచిస్తూనే రాఘవయ్య ఇంటి ముందుకొచ్చేశాడు విశ్వం.

"మా నాన్న మిమ్మల్ని డబ్బిడిగాడటగదండీ!" అంటూ గొణిగాడు విశ్వం గుమ్మం దగ్గరే నిలబడి.

"అవును - అడిగాడు... ఈ వేళకే వచ్చేశావా? నేనింకా బ్యాంక్‌కి వెళ్ళందే? పరమేశ్వరయ్య పెద్దబ్బాయివికదా నువ్వు... ఏ ఉద్యోగం చేస్తున్నావు?" గుమ్మానికవతలనే నిలబడి అన్నాడు రాఘవయ్య.

"ఇంకా ఏం లేదండీ!"

"ఈ వయసొచ్చినా నిన్ను కూచోబెట్టి సాకుతున్నాడన్నమాట మీ నాన్న... మావాడు నీకంటే పదేళ్ళు చిన్నవాడేమో! అయినా చక్కగా వ్యాపారం చేసి నెలకు రెండువేలు సంపాదిస్తున్నాడు... మనకూ కొంచెం పట్టుదల వుండాలయ్యా... తండ్రి సంపాయించి పెడతాడులే హాయిగా తినేద్దాం అనుకుంటే ఎలా?"

ఒక్కసారి విశ్వానికి రోషం ముంచుకొచ్చింది - 'డబ్బుంటే ఇవ్వండి. లేకపోతే

లేదు. మా సొంత విషయాల్లో మీ జోక్యం ఏమిటీ... ఉద్యోగం కోసం ఎన్ని తిప్పలు పడుతున్నానో మీకేం తెలుసు? ఊరికే నోటికొచ్చినట్టు వాగితే సరికాదు' అని నాలుగు దులిపేయాలనిపించింది. అలా దులిపేశాక అప్పు ఎలా ఇస్తాడు? తనకోపం నాన్నని ఇబ్బందుల్లో పడేస్తుంది. అందుకే కిమ్మనకుండా నిలుచున్నాడు విశ్వం.

"ఏమిటయ్యా – అలా మాటాడకుండా నిలబడ్డావు... మీ అక్కయ్య పెళ్ళికి ఇరవై వేలు అప్పు చేశాడటగా మీ నాన్న – నిన్న సాయంత్రం అన్నీ చెప్పాడులే – దానికి వడ్డీ కట్టేందుకేమో నా దగ్గర అప్పడిగాడు. నీకూ ఉద్యోగముంటే అతనికి కొంచెం భారం తగ్గి వుండేదని అన్నాడు... బి.ఏ చదివావటగా... ఈ కాలంలో ఎమ్.ఏ.లూ, పి.హెచ్‌డీలూ చేసిన వాళ్ళకే ఉద్యోగాలు రావటం లేదు. అదీ అదృష్టంలే! సరేకానీ... మరోగంట తర్వాత కనబడు – ఆలోగా బ్యాంక్‌కి వెళ్ళి డబ్బులు తీసుకొని వస్తాను" అని అంటూనే తలుపులేసుకున్నాడు రాఘవయ్య.

గంగిరెద్దులా తల ఆడించేసి అలా వీధిలోకి మెల్లగా అడుగులేస్తూ బయల్దేరాడు విశ్వం.

అడ్డమైన ప్రతివాడూ తనకి ఉద్యోగం లేదని ఏదోరకంగా అవమానిస్తూ మాట్లాడతాడు. ఏ మనిషికయినా నిరుద్యోగాన్ని మించిన శిక్ష వుండదేమో!

"ఒరేయ్ విశ్వం!" అన్న పిలుపు వినిపించేసరికి తల వంచుకుని నడుస్తున్న వాడల్లా తలెత్తి చూశాడు. ఎదురుగా శంకర్ నవ్వుతూ వున్నాడు బి.ఏ.లో విశ్వానికి క్లాస్‌మేట్, శంకర్.

"ఏరా... ఏమిటంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావ్ – ఎదురుగా వచ్చే మనుషుల్ని కూడా చూడకుండా" అన్నాడు శంకర్.

"అబ్బే... ఏం ఆలోచించటంలేదురా!" అన్నాడు నవ్వుతూ విశ్వం.

"నాకు వీ.డీ.వో. ఉద్యోగం వచ్చిందోయ్... అంటే విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసరు... మొన్న '86లో జరగలేదూ గ్రూప్ త్రీ ఎగ్జామ్' అది పాసయ్యాను" శంకర్ గొంతులో గొప్ప సంతోషంతోపాటు కాస్తంత గర్వం కూడా మిళితమై వుంది.

"కంగ్రాచ్యులేషన్స్!" అన్నాడు విశ్వం. నవ్వుతూ అనాలని అతని ఉద్దేశం – అయితే తనకురాని ఆ ఉద్యోగం పెదాలమీదకు నవ్వుని రానివ్వలేదు.

"థాంక్యూ! నువ్వు నాతోపాటూ రాశావుగా పరీక్ష – ఏమయింది?"

"ఏం కాలేదు – పాసయివుంటే నేనూ నీతో కంగ్రాచ్యులేషన్సు చెప్పించుకునే వాణ్ణిగా!"

"అమ్మో... భలే జోకులేస్తావురోయ్! ఈ శుభసందర్భంలో కాఫీ తాగుదాం పదా"

మిత్రులిద్దరూ దగ్గర్లోని హోటల్లోకి వెళ్ళికూచున్నారు.

"అసలు నాకీ ఉద్యోగం రాదనుకున్నారా! నీకో విషయం తెలుసా – వచ్చేనెలలో నాకు ముప్ఫయినాలుగేళ్ళు నిండిపోతాయి. అంటే గవర్నమెంటు ఉద్యోగాలకి వయసు దాటిపోయినట్టేగా... లక్కీగా ఈ ఉద్యోగం వచ్చింది..."

తనకూ ముప్ఫయినాలుగేళ్ళు మరో రెండు నెలల్లో నిండిపోతున్న విషయం గుర్తుకొచ్చి ఒళ్ళంతా ఓసారి కంపించిపోయింది విశ్వానికి.

కాఫీ తాగుతూ తను ప్రిలిమినరీ పరీక్ష ఎలా రాసిందీ... తర్వాతి పరీక్ష ఎలా రాసిందీ చెప్పుకుపోతున్నాడు శంకర్. విశ్వం ఎంతో ఇబ్బందిగా అతనివేపు చూస్తూ "ఊ" కొడుతున్నాడు యాంత్రికంగా. విశ్వానికి అతని మాటలు వినిపించనంత దూరంగా పారిపోవాలని వుంది.

"ఈసారి పరీక్షలైనా బాగా రాయవోయ్! తల్లిదండ్రులమీద ఇంకా ఆధారపడుతూ వుండటానికి మొహమాటంగా లేదూ?" తమాషాకి అన్నాడు శంకర్ విశ్వంతో తనకున్న చనువుతో.

"ఉద్యోగం వచ్చిందికదా అని నానాకూతలూ కూయకురా శంకర్!" అన్నాడు విశ్వం కాస్త కోపంగానే.

"అంత కోపం పనికిరాదు బ్రదర్! నేనేం నీకు జ్ఞానబోధ చేయడానికి రాలేదు. మీ నాన్న ఒక్కరేగా అర్నింగ్ మెంబరు... ఇంకా పెళ్ళి కావాల్సిన చెల్లెళ్ళున్నారు... అనకూడదుకానీ, మీ నాన్నకాస్తా 'హరీ'మంటే మీ పరిస్థితెంత భయంకరమో ఆలోచించు" నింపాదిగా అన్నాడు శంకర్.

"నోరు మూయరా వెధవా!" అంటూ గట్టిగా అరిచాడు విశ్వం. హోటల్లో అందరూ ఓసారి విశ్వంవేపు చూశారు.

గభాల్న తల దించేసుకున్నాడు విశ్వం.

విశ్వం ఎందుకంత గట్టిగా అరిచాడో అర్థం కాలేదు శంకర్‌కి. తన 'సహజధోరణి' విశ్వాన్ని నొప్పించిందని నమ్మలేకుండా వున్నాడు...

"సారీరా విశ్వం!" అంటూ కాఫీ బిల్లుని తీసుకుని లేచి నిలుచున్నాడు శంకర్.

❀ ❀ ❀ ❀

పొద్దు వాలిపోతోంది.

వేపచెట్టుకు ఆనుకున్న వాడల్లా ఓసారి చుట్టూ కలయజూశాడు విశ్వం.

చెట్టూ చేమలుతప్ప చుట్టుపక్కల ఒక్క పురుగు కూడా కనిపించడం లేదు. ఓ అరమైలు దూరంలో ఊరు కనిపిస్తోంది.

ఉదయంనుంచి విశ్వంలో చెప్పలేనంత నిస్పృహ కలుగుతోంది. అతని మనసు ఏకాంతాన్ని కోరుకుంటోంది. అందువల్లే మిత్రుల్ని ఎవర్నీ కలవకుండా ఇలా ఊరి బయటికి వచ్చేశాడు. అతనికి అంత నిస్పృహ కలగడానికి కారణం – ఆరోజు మార్చి ఎనిమిదో తేదీ అవడమే. అంటే ఆరోజు తన పుట్టినరోజన్నమాట. తనకు ముప్పయి నాలుగేళ్ళు నిండిపోతున్నాయి ఆరోజుతో. తనిక ఏ గవర్నమెంటు ఉద్యోగానికి దరఖాస్తు చేయడానికీ పనికిరాడు.

ఇన్నేళ్ళు తనని పెంచి పెద్దచేసిన నాన్నకి – తన చెల్లెళ్ళతోపాటు తనూ భారమైనాడేగాని ఉద్యోగంచేసి నాలుగురాళ్ళు సంపాయించి కష్టాల ఊబిలో కూరుకుపోతున్న తండ్రిని ఆదుకోలేకపోయాడు.

ఏదన్నా చిన్న ప్రయివేటు సంస్థలో ఉద్యోగంకోసం ప్రయత్నిద్దామా అంటే ప్రభుత్వ సంస్థలకంటే ఘోరంగా వున్నాయవి, అక్కడ మరీ పెద్ద పలుకుబడి ఉండాలి. తనకులేందల్లా అదీ, డబ్బే!

ఏదయినా వ్యాపారం చేసుకుని బతకడం తనకి చేతకాదు. తను అవిటివాడు కాకున్నా - రిక్షాతొక్కో, కట్టెలుకొట్టో జీవించడానికి వీలుకాకుండా మానసికంగా అవిటితనాన్ని సంతరించిపెట్టింది మధ్యతరగతి మనస్తత్వం.

తనమీద తనకే ఎనలేని జాలివేసి ఒక్కసారి బిగ్గరగా భోరున ఏడ్చేశాడు విశ్వం... తనకిక జీవితంలేదన్నది స్పష్టం! రెండు నిమిషాల తర్వాత సిగరెట్ తాగాలనిపించిందతనికి. సగంకాల్చి మళ్ళీ తాగాలని వుంచుకున్న సిగరెట్టుని వెలిగించుకోడానికి అగ్గిపెట్టెకోసం వెదికాడు. అంతకుక్రితమే చివరి అగ్గిపుల్ల వెలిగించి ఖాళీడొక్కును దూరంగా విసిరేసినట్టు గుర్తుకొచ్చి నిరుత్సాహపడిపోయాడు.

ఎద్దులమెడలోని గంటల శబ్దం వినిపించినట్టయి లేచి చూశాడు విశ్వం. కొద్దిదూరంలో జోడెద్దులబండి ఊరిలోంచి వస్తోంది. బండితోలేవాడి దగ్గరయినా సిగరెట్టును వెలిగించుకోవచ్చుకదా అని సగం కాలిన సిగరెట్టుతో బండివేపు కదిలాడు విశ్వం.

'అగ్గిపెట్టె కావాలి' అన్నట్టు సంజ్ఞచేశాడు, బండి మనిషికి దూరం నుంచే.

బండి మనిషి ఎద్దుల్ని పగ్గాలతో బిగపట్టి బండి నిలిపేశాడు.

దగ్గరకెళ్ళాక బండి తోలుతున్న మనిషిని చూసి ఉలిక్కిపడ్డాడు విశ్వం. అతను ఎవరోకాదు - ప్రతిరోజూ వాళ్ళింటికి పాలుతెచ్చే సుబ్బయ్యే. గోచిపంచె, ముతకరకం చొక్కా వేసుకొని వున్నాడు. అతని వెనకాల ఒక ఆడమనిషి కునికిపాట్లు పడుతోంది. ఆమె అతని భార్య కాబోలు అనుకున్నాడు విశ్వం.

సుబ్బయ్య అగ్గిపెట్టె తీసి ఇస్తూనే అన్నాడు.

"ఇదేంది సామీ! నువ్విడున్నావు... నీకు తెలిసినట్టు లేదే అసలిసయం... ఆడ మీ నాయనకు..." అని చెబుతుండగానే...

"ఏమయిందీ?" అన్నాడు అగ్గిపెట్టెని అందుకుంటూ.

"మధ్యాహ్నం... పెద్దాసుపత్రిలో... మీ నాయనకి గుండెనొప్పి వచ్చిందని చేర్పించినారు... నేను పలకరించేలోపలే కన్ను మూసినాడు... నువ్వు కొడుకువి కదా - సచ్చేటప్పుడయినా దగ్గరుండొద్దా. అగ్గిపెట్టెకోసరం నువ్వొచ్చిందే మంచిదయింది. లేకపోతే నీకిప్పుడే ఈ వార్త తెలిసేది కాదు కదా! తొందరగా ఎళ్ళుసామీ!" అంటూనే అగ్గిపెట్టెకోసం ఎదురు చూడకుండా ఎద్దుల్ని అదిలించాడు. బండి ముందుకు సాగిపోయింది.

చేష్టలుడిగి వింటున్న వాడల్లా ఒక్కసారి తల విదిలించుకున్నాడు... చేతిలో సగం కాలిన సిగరెట్టూ, అగ్గిపెట్టె ఎప్పుడు జారిపోయాయో.

పరిగెత్తబోయి బోర్లాపడ్డాడు విశ్వం. మెల్లగా లేచి నడక సాగించాడు...

నాన్న... తన నాన్న చనిపోయాడు. తనని కన్న నాన్న, పెంచిన నాన్న, ప్రేమించిన నాన్న... చనిపోయాడు. ఒక్క అరగంట ఆలస్యంగా ఇంటికిపోతే తను ఏమైపోయాడోనని బెంగపెట్టుకునే నాన్న తనకికలేడు.

జీవనపోరాటంలో... ఎదిగిన కొడుకు కనీస సహాయం చేయలేక పోయినా ఒక్కడే పోరాడి పోరాడి అలసి, సొలసిన నాన్న శాశ్వతంగా నిద్రపోయాడు.

"నాన్నా!!!" అంటూ ఒక్కసారి వెర్రికేక పెట్టాడు విశ్వం. దిక్కులు సమాధానమివ్వడం మాని విశ్వాన్నే చూస్తూ ఉన్నాయి మౌనంగా.

వడివడిగా ఊరివేపు నడుస్తున్నాడేకానీ అడుగులు సరిగా పడటంలేదు.

ఇకనుంచీ అమ్మనూ, ముగ్గురు చెల్లెళ్ళనీ తను పోషించాలన్నమాట. ఎలా...? తనకి ఉద్యోగం ఎలా వస్తుంది?

రెండు క్షణాల్లో మెరుపులాంటి ఆలోచన వచ్చింది విశ్వానికి.

నాన్న గవర్నమెంటు ఉద్యోగి - చనిపోయిన ఉద్యోగి కొడుకుకు తప్పకుండా ఉద్యోగం ఇస్తుంది ప్రభుత్వం.

అవును... తనకిక ఉద్యోగం!

అతి తొందరలో తనకిక ఉద్యోగం!!

విశ్వం కళ్ళలో ఆనందరేఖ మెరిసి మాయమైంది.

నాన్నకి రావాల్సిన ప్రావిడెంటు ఫండు తోనూ, గ్రూప్ ఇన్సూరెన్సు వాళ్ళు ఇచ్చే డబ్బుతోనూ అక్కయ్య పెళ్ళిబాకీ తీర్చేసి, ముగ్గురి చెల్లెళ్ళ పెళ్ళి చేసేస్తాడు.

ఏదేమైనా తనకిక ఉద్యోగం!

అవును - తనకిక ఉద్యోగం!!

ఛీ! ఛీ!! ఛీ!!! తను మనిషా? రాక్షసుడా? తండ్రి చనిపోతే... ఇవేం ఆలోచనలు... తనకీ - రాక్షసుడికీ ఏం తేడా?

తనమీద తనకే అసహ్యమేస్తోంది!

అవును... తన ఆలోచనలన్నీ పాడువే!!

తొందరలో తనకిక ఉద్యో...

ఛీ ఛీ!!!

తన అక్కయ్య పెళ్ళి బాకీ -

తన చెల్లెళ్ళ పెళ్ళి సమస్యలు -

తక్కిన జీవిత సమస్యలు -

అన్నీ పటాపంచలు...

నాన్న బతికుండేప్పుడు తీరని సమస్యలు... ఆయన చనిపోయాక తీరేందుకు సిద్ధంగా వున్నాయి. ఎంత విచిత్రం!

తనేనా ఇలా ఆలోచిస్తోంది!

నిద్రపోతూ ఉన్న నాన్న చనిపోయాడేమోననే ఆలోచన వస్తేనే భరించలేక ఆందోళన పడిపోయిన తనేనా ఇలా ఆలోచిస్తోంది!

తనసలు మనిషేనా!

తనకి ముప్ఫయినాలుగేళ్ళు దాటితేనేం... తనకీ ఉద్యోగం వచ్చేస్తుంది!

అసలు రాకేం చేస్తుంది!

గంతులేద్దామనిపిస్తోంది అతనికి.

నాన్న శవం జ్ఞాపకం వచ్చి విరమించుకున్నాడు.

పాడు ఆలోచనల్ని కౌగలించుకుంటూనే విశ్వం అడుగులు ఇప్పుడు వడివడిగా పడుతున్నాయి, ఇంటివేపు.

• *ఆగష్టు, 1988 - విపుల* •